ప్రజాశక్తి

గురువారం 2 మార్చి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





గ్యాస్ మంటలు



ఉమ్మడి కృష్ణాజిల్లా వినియోగదారులపై రూ.108.72 కోట్ల భారం

గృహదారులపై రూ.80.16 కోట్లు

కమర్షియల్‌దారులపై రూ.28.56 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచింది. గతంలోనే గ్యాస్ రాయితీలను ఎత్తివేసిన కేంద్రం తాజాగా గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచింది. దీంతో సిలిండర్లు కొని స్టౌవ్ వెలిగించాలంటనే వణుకుపుట్టే పరిస్థితి ఏర్పడింది. ఈ ధరల పెంపుతో ఉమ్మడి కృష్ణాజిల్లా (కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలు)లోని గృహ, కమర్షియల్ సిలిండర్ల వినియోగదారులపై ఏడాదికి రూ.108.72 కోట్ల మేర భారం పడుతింది. నెలకు రూ.9.06 కోట్ల మేర అదనంగా గృహ, కమర్షి యల్ వినియోగదారులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో గృహ వినియోగదారులపై నెలకు రూ.6.68 కోట్లు, కమర్షియల్ వినియోగదారులపై రూ.2.38 కోట్ల మేర భారం పడుతుంది.

మచిలీపట్నంలో గృహపయోగానికి వినియోగించే 14 కిలోల సిలిండర్ ధర రూ.1085.50 నుంచి రూ.1135.50కు చేరింది, విజయవాడలో రూ.1075.50 నుంచి రూ.1125.50లకు పెరిగింది. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో నెలకు 13,37,727 (మిగతా 6లో)

నెలకు వినియోగం	గతంలో ధర	ప్రస్తుత ధర	నెలకు భారం	ఏడాదికి భారం
కృష్ణాజిల్లాలో గృహ వినియోగ సిలిండర్లు - భారం				
6,06,497	రూ.1085.50	రూ.1135.50	రూ.3,03,24,850	రూ.36,38,98,200
ఎన్‌టిఆర్ జిల్లాలో గృహ వినియోగ సిలిండర్లు - భారం				
7,31,230	రూ.1075.50	రూ.1125.50	రూ.3,65,61,500	రూ.43,87,38,000
మొత్తం గృహ వినియోగ సిలిండర్లు - భారం				
13,37,727	---	----	రూ.6,68,86,350	రూ.80,26,36,200
ఉమ్మడి కృష్ణాజిల్లాలో కమర్షియల్ సిలిండర్లు - భారం				
నెలకు వినియోగం	గతంలో ధర	ప్రస్తుత ధర	నెలకు భారం	ఏడాదికి భారం
విజయవాడ 36,000	రూ.1929.50	రూ.2260.50	రూ.1.26 కోట్లు	రూ.15.12 కోట్లు
ఉమ్మడి కృష్ణా 32,000	రూ.1930.50	రూ.2279.50	రూ.1.12 కోట్లు	రూ.13.44 కోట్లు
మొత్తం 68,000	-----	--------	రూ.2.38 కోట్లు	రూ.28.56 కోట్లు

పెల్లుబికిన ప్రజాగ్రహం


విజయవాడ, ఉయ్యూరు, గన్నవరంలో నిరసనలు

ఇంట్లో బాంబ్ పేల్చిన మోడీ సర్కార్ : సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్.బాబూరావు విమర్శ

ప్రజాశక్తి - విజయవాడ : గ్యాస్ ధరల పెంపుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. బుధవారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. విజయవాడ బీసెంట్ రోడ్డు, ఉయ్యూరు, గన్నవరంలలో ప్రజలు నిరసనలు వ్యక్తం చేశారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని అన్సారీపార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా జరిగింది. మహిళలు గ్యాస్ సిలిండర్లను తలపై పెట్టుకుని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రధాని మోడీ డౌన్‌డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉయ్యూరులో ఐద్వా ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. గన్నవరంలో సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పెంచిన ధరలను తగ్గించకపోతే మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. మోడీ సర్కార్ ప్రతి ఇంట్లో గ్యాస్ బాంబు పేల్చిందని విమర్శించారు. ఎనిమిదేళ్ల క్రితం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను 1125 రూపాయలకు పెంచిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీకి పూర్తిగా ఎగనామం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులపై ధరల భారాన్ని మోపి ప్రజల జేబులు కొడుతున్న కేంద్ర ప్రభుత్వం అదాని, అంబానీ వంటి కార్పొరేట్ల ఖజానా నింపుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గుతుండగా, మనదేశంలో మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయన్నారు. త్రిపుర, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో ఎన్నికల ముగిసిన రెండు రోజుల్లోనే వీటి ధరలను పెంచడం (మిగతా 6లో)

ఉత్తర, దక్షిణ మండలాలుగా బందరు

ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : రాష్ట్రంలో కొత్తగా మరో 6 మండలాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆరు జిల్లా కేంద్రాలను రెండు మండలాలుగా విడదీస్తూ బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నాన్ని (బందరు) మచిలీపట్నం దక్షిణ, ఉత్తర మండలాలుగా విభజించనున్నట్లు పేర్కొంది. మచిలీపట్నం నగరంలోని 1 నుండి 19 డివిజన్లు, 40 డివిజన్‌తోపాటు మరో 18 గ్రామాలను కలిపి మచిలీపట్నం ఉత్తర మండలంగా విభజిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే మచిలీపట్నం నగరంలోని 20 నుండి 39 వరకు డివిజన్లతోపాటు మచిలీపట్నం రూరల్‌సహా 12 గ్రామాలను మచిలీపట్నం దక్షిణ మండలంగా విభజించింది. ఈ మండలాల విభజనపై అభ్యంతరాలుంటే తెలపాలని కోరింది. నెలలోగా అభ్యంతరాలను కృష్ణాజిల్లా కలెక్టర్‌కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లో పేర్కొంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1,39,578 మందితో ఉత్తర మండలం, 99,384 మందితో దక్షిణ మండలం ఏర్పాటు చేయనున్నారు. **ఉత్తర మండలం హద్దులు :** తూర్పున సముద్రం, పశ్చిమాన పెడన, బంటుమిల్లి మండలాలు, ఉత్తరాన కృత్తివెన్ను, దక్షిణాన మచిలీపట్నం దక్షిణ మండలం. ఉత్తర మండలంలోని డివిజన్లు, గ్రామాలు, జనాభా వివరాలు...పెదపట్నం జనాభా 1997, కానూరు 2609, తాళ్లపాలెం, 7304, గోకవరం 1378, మంగినపూడి 2138, బుద్దాయపాలెం 1316, తవిశపూడి 813, కొత్తపూడి పొట్లపాలెం 752, పొట్లపాలెం 550, గోపువానిపాలెం 1060, అరిశేపల్లి 2570, హుస్సేన్‌పాలెం అరిశేపల్లి 833, కరగ్రహారం 4689, మాచవర పోతేపల్లి 1034, చిలకలపూడి మేకవానితోట 2178, మచిలీపట్నంలోని 1 నుండి 19 వరకు డివిజన్లు, 40 నుండి 50 వరకు డివిజన్లు కలిపి జనాభా 1,04,176. ఉత్తర మండలంలో జనాభా మొత్తం 1,39,578 మంది ఉన్నారు.

దక్షిణ మండలం హద్దులు : తూర్పున సముద్రం, పడమట చల్లపల్లి మండలం, ఉత్తరాన మచిలీపట్నం ఉత్తర మండలం, దక్షిణాన కృష్ణానదీ పరీవాహక ప్రాంతం, కోడూరు మండలాలు. దక్షిణ మండలంలోని డివిజన్లు, గ్రామాలు, జనాభా వివరాలు సౌత్ మండలం వివరాలు బందరు రూరల్ గరాలదిబ్బ జనాభా 570, ఎస్‌ఎన్ గొల్లపాలెం 6,005, గుండుపాలెం 1,857, రుద్రవరం 1,779, కోన 3,124, పోలాటితిప్ప 2,431, పిటి పాలెం 2,567, చిన్నాపురం 5,204, భోగిరెడ్డిపల్లి 2,464, పెదయాదర, వాడపాలెం 4,785, నెలకొర్రు, గొల్లపాలెం 3,016, మచిలీపట్నం నగరంలోని 20 నుంచి 39 వరకు డివిజన్ల కలిపి జనాభా 65,602 మంది ఉన్నారు. మొత్తంగా దక్షిణ మండలంలోని జనాభా 99,384మంది.

స్వరాజ్య మైదానం ఆక్రమణలపై హామీ అమలు చేయకపోతే జైలే

విఎంసి కమిషనర్‌కు హైకోర్టు హెచ్చరిక



ప్రజాశక్తి-అమరావతి : విజయవాడ స్వరాజ్ మైదానాన్ని ఆక్రమణల నుంచి కాపాడుతామని గతంలో ఇచ్చిన హామీ కి విరుద్ధంగా ఏమైనా జరిగితే జైలు కు పంపుతామని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను హైకోర్టు హెచ్చరించింది. హైకోర్టుకు ఇచ్చిన హామీకి భిన్నంగా కమిషనరు చర్యలుంటే వాటిని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. స్వరాజ్ మైదానానికి చెందిన భూమి ఇష్టానుసారంగా ఆక్రమణలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాశ్ 2015లో దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున న్యాయవాది ఎంఆర్‌కె చక్రవర్తి వాదిస్తూ.. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో ఏ విధమైన నిర్మాణాలూ చేపట్టొద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో హైకోర్టు పైవిధంగా ఆదేశించి, తదుపరి విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేసింది.



మహిళా క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న మంత్రి రోజా

వార్త 4లో

మహిళా పక్షపాతి జగన్

మంత్రి ఆర్‌కె రోజా : మహిళా కబడ్డీ విజేతలకు బహుమతులు

పాలధర పెంపు అన్యాయం

ధర్నాలో సిపిఎం నేత బాబూరావు



కృష్ణా మిల్క్ ఫ్యాక్టరీ వద్ద ధర్నాలో సిపిఎం బాబూరావు, శ్రీదేవి, బోయి సత్యబాబు, రమణారావు తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఏడాదిలో మూడు సార్లు పాల ధరలను పెంచడం అన్యాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. విజయ పాల ధరల పెంపును నిరసిస్తూ బుధవారం చిట్టినగర్‌లోని విజయ మిల్క్ ఫ్యాక్టరీ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పాల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. కృష్ణా మిల్క్ (మిగతా 6లో)

6 నుంచి వత్సవాయమ్మ తిరునాళ్లు



ప్రజాశక్తి-వత్సవాయి: ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు శ్రీ వత్సవాయమ్మ అమ్మవారి దేవస్థానం తిరునాళ్లమహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని తహశీల్దార్ వైకుంఠరావు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో వత్సవాయమ్మ తల్లి దేవస్థానమును పరిశీలించారు. ఈ తిరణాల మహోత్సవాలకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని భక్తులకి ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించాలని తెలిపారు. ఎండోమెంట్ వారు టెంట్లు డ్రింకింగ్ వాటర్ ప్రసాదాలు కౌంటర్లు ఏర్పాటు చేసి భక్తులకి ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, ఎండోమెంట్ నుండి నాగార్జున, వత్సవాయి ఈవో ఇమాం సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటనారాయణ, దూకే రంగారావు, వీఆర్వో పరమేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం



ప్రజాశక్తి-భవానీపురం: విద్యాధరపురంలోని కె.ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఫుట్‌ఫాత్‌పై ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం పడివున్న సంఘటనపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు వద్ద పార్వతి కౌతవరపు నివాసం వుంటున్నారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గల సచివాలయంలో పార్వతి మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తుంటుంది. ఈ నేపథ్యంలో విధుల్లో భాగంగా బుధవారం 12 గంటల సమయంలో కెఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ దగ్గరలో ఫుట్‌ఫాత్ మీద సుమారు 30-40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు సమాచారం మేరకు ఆమె వెళ్ళి చూసి, భవానీపురం పోలీసులకు సమాచారం అందించింది. బ్లూ అండ్ వైట్ కలర్ టీ షర్ట్, గ్రే కలర్ ఫ్యాంటు, నల్ల బెల్ట్ ధరించి ఉన్నాడు. కుడి చేతికి గ్రీన్ కలర్ బ్యాండ్‌తో పాటు కడియం ధరించి ఉండి ఎడమ చేతికి వేలుకి రాగి ఉంగరం, చిటికెన వేలుకి స్టీలు ఉంగరం కలిగి వున్నాడు. చుట్టుపక్కల విచారించిన అతని గురించి ఆచూకీ లభించలేదు. ఊరు, పేరు తెలియని వ్యక్తి మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచినట్లు భవానీపురం సిఐ ఎం.డి. ఉమర్ తెలిపారు. వివరాలు తెలిసిన వారు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

సైన్స్ ఎక్స్‌పోలతో విజ్ఞానం

ప్రజాశక్తి-భవానీపురం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఇటువంటి సైన్స్ ఎక్స్‌పోలు ఎంతో దోహదం చేస్తాయని హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు షేక్ హనీఫ్ అన్నారు. వించిపేటలోని ఆల్ కరీం ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్ నందు మంగళవారం నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని స్కూల్ నందు ప్రాజెక్ట్ ఎక్స్‌ఫో సైన్స్ ఫెయిర్, స్టాంప్స్ అండ్ కాయిన్ కలెక్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి గాపాల్గొన్న ఆయన మాట్లాడుతూ సైన్సు మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నేడు ప్రపంచం అన్ని రంగాల్లో అభివద్ధి చెందుతుంది అంటే అందుకు సైన్స్ ప్రధాన కారణమన్నారు. మన దేశం కూడా వైజ్ఞానికంగా ఎంతో అభివద్ధి చెందుతూ ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశంగా అవతరించిందని అన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని వైజ్ఞానిక అంశాలలో ప్రావీణ్యత సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు వైజ్ఞానిక అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ కరస్పాండెంట్ ముఫ్తీ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





ఫిష్ రిటైల్ అవుట్ లెట్ల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ: మత్స్య సంపదకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి తాజా నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన మత్స్య ఆహారాన్ని అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నెలకొల్పే యూనిట్లు మత్స్యకారుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో కేంద్రప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ఫిష్ రిటైల్ అవులెట్లు, ఫిష్ రిటైల్ మార్కెటింగ్ హబ్‌లు, ఫిష్ కియోస్క్, ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్ త్రీ వీలర్ మోటర్ సైకిళ్ళ పంపిణీ, లైవ్‌ఫిష్ అమ్మక కేంద్రాల వంటి యూనిట్లను నెలకొల్పేందుకు సబ్సిడిని అందించడం జరుగుతుందన్నారు. మత్యకారులకు చేపలను వేటాడి జీవనోపాధి కల్పించేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన దాదాపు 15 లక్షల చేప పిల్లలను కృష్ణానదిలో విడుదల చేయడం జరిగిందని, మరో 10 లక్షలలో చేప పిల్లలను కొనుగోలు చేసి విడుదల చేయవలసి ఉందని, మూడు యూనిట్ల చేపపిల్లలను విడుదల చేసేందుకు 9 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరుగుతుందని ఇందుకు సంబంధించి మత్స్య సీడ్‌ను సరఫరా చేసే ఏజెన్సీని ఖరారు చేయాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఒక్కొక్కటి 20 లక్షల వ్యయంతో 9 ఇన్స్‌లేటడ్ వాహనాలను మంజూరు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ నాగరాజా, డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి యం విజయభారతి, డిఆర్‌డిఏ కె శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాందయ్య, పియంఎస్ డైరెక్టర్ లంకె గోవిందరాజులు, ఏడి సిహెచ్ చక్రాణి, ఎఫ్‌డివోలు పి అఖిల, కె. నాగబద్ర, బి లెనిన్‌బాబు, ఉన్నారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు పనులను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుని నిర్థేశించిన లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై స్థానిక కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, మున్సిపల్ కమీషనర్లు, యంపిడివోలు, స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్థార్లు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న గృహాలలో ఉగాది నాటికి సుమారు 16 వేలకు పైగా గృహలను లబ్దిదారులతో గృహ ప్రవేశాలు జరిపించాలనే లక్ష్యంగా నిర్థేశించుకున్నామన్నారు. ఇప్పటికే 8,620కు పైగా గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. మరో వివిధ దశలలో ఉన్న 7,727 గృహాలతో పాటు తుది దశలో ఉన్న 2,021 గృహాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల లబ్దిదారులకు కేటాయించిన లే అవుట్లలో ప్రారంభించవలసిన గృహలు, మండలాలు, మున్సిపల్ పరిధిలోని లేఅవుట్లలో ప్రారంభించవలసిన గృహా నిర్మాణాలను పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. ఏపి సేవా సర్వీస్‌కు సంబంధించి 1,646 అర్జీలు నిర్థేశించిన గడువులోగా పరిష్కరించవలసి ఉన్నాయన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, హౌసింగ్ పిడి శ్రీదేవి, డిఇ రవికాంత్, కలెక్టరేట్ భూ విభాగ సూపరిండెంట్ యం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్లు నచ్చకపోతే పట్టాలు వెనక్కిచ్చేయండి : ఎంఎల్ఎ



పరిటాలలో ఎమ్మెల్యే ను నిలదీస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో, నివాసయౌగ్యం కాని చోట ఇళ్లస్థలాలు ఇచ్చారు....తీరా అక్కడ ఇల్లు కట్టంకుందామంటే కోర్టు గొడవల్లో ఉంది. గ్రామంలో నడబొడ్డున విలువైన స్తలాలను అధికార పార్టీ నాయకులు వారి అనుచరులకు ఇప్పించుకున్నారు..... ముస్లిం లంటే చులకనగా ఉంది. అర్హత ఉన్నా పెన్షన్లు తొలగిస్తున్నారు... నాలుగేళ్ళ ఎన్నికలప్పుడు వచ్చారు.. మళ్ళీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇంటింటికీ తిరుగుతున్నారు.. అని కంచికచర్ల మండలం పరిటాల ముస్లిం ఏరియా లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు కు బుధవారం రెండో రోజు మహిళల నుండి నిరసన సెగ తగిలింది.. దీంతో ఎమ్మెల్యే కూడా ఇళ్ళ స్థలాలు తీసుకోవటం ఇష్టం లేకపోతే పట్టాలు తిరిగి ఇచ్చేయండంటూ మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి పాత ముస్లిం ఏరియా సమస్యలపై ఎమ్మెల్యే ను మహిళలు నిలదీయటమే కాకుండా మా ఇళ్ళకు రావద్దని బూతుల పురాణం ఎత్తిన విషయం తెలిసిందే. బుధవారం కొత్త ముస్లిం ఏరియా లో ఎమ్మెల్యే ఇంటింటికీ కార్యక్రమం మొదలు పెట్టగానే ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అఃదటం లేదని కొందరు, పథకాలు తొలగిస్తున్నారని కొందరు నిలదీశారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ఉదయం 11 గంటలకు ముగించే వరకు ఏ ఇంటికి వెళ్ళినా ఎమ్మెల్యే కు నిరసన ఎదురైంది. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ఇచ్చిన చోట స్థలాలు నచ్చక పోతే వారి వద్ద నుండి పెట్టాలు వెనక్కి తీసుకోండని రెవిన్యూ, వెల్ఫేర్ సిబ్బంది ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, వైసిపి నాయకులు చింతా రవి, మార్త శ్రీనివాసరావు, కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.



మునుకుళ్లలో పొలంబడి

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలం మునుకుళ్ల లో మేలైన వ్యవసాయ పద్ధతుల పొలం బడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం నిర్వహిం చారు. జిల్లా వ్యవసాయ అధికారి డి.శ్రీ నివాసరావు పోలంబడిని పనితీరును పర్యవేక్షించి సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మ, మాస్టర్ ట్రైనర్లు సురేష్, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.

కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్

గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లు సీజ్



ప్రజాశక్తి-విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలోని కొండ ప్రాంతాలు, పోలవరం కాలువ గట్టు వద్ద అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను తహశీల్దార్ పి.జాహ్నవి బుధవారం సీజ్ చేశారు. మొత్తం ఐదు టిప్పర్లను ఆమె టూటౌన్ పోలీసులకు అప్పగించి, అక్రమ మైనింగ్ పై ఫిర్యాదు చేశారు. అలాగే కొత్తూరు తాడేపల్లి ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సమాచారం అందించారు. కొత్తూరు తాడేపల్లి ప్రాంతంలో కొన్నేళ్లుగా కొండ ప్రాంతాలు, పోలవరంకాల్వ కట్ట ప్రాంతం, ప్రైవేటు భూముల్లో గనులు, భూగర్భ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అధికార ప్రజాప్రతినిధుల అండ తో కొందరు అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుపుతున్నారు. నిత్యం రూ.లక్షలు విలువ చేసే గ్రావెల్‌ను వందలాది టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. అక్రమ మైనింగ్‌పై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇంతవరకు ఏ అధికారి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో అక్రమ మైనింగ్‌పై స్థానికులు కొందరు మరోసారి తహశీల్దార్ జాహ్నవికి సమాచారం అందించగా ఆమె వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొత్తూరు తాడేపల్లి నుంచి విజయవాడలోని పలు ప్రాంతాలకు, చుట్టుపక్కల ప్రాంతాలకు గ్రావెల్ రవాణా చేస్తున్న పలు టిప్పర్లను తహశీల్దార్ జాహ్నవి, సిబ్బంది అడ్డుకున్నారు. డ్రైవర్లు తమ పర్మిట్లను చూపించాలని ఆమె కోరగా, వారు మైనింగ్ శాఖ నుండి పొందిన సరైన అనుమతిని చూపించడంతో విఫలమయ్యారు. అలాగే తహశీల్దార్‌కు పొంతనలేని సమాధానాలు చెప్పారు. అనంతరం ఆమె కొత్తూరు తాడేపల్లి ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు జరిపిన మైనింగ్ స్థలాలను పరిశీలించారు. ఐదు టిప్పర్లను సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మైన్స్ అండ్ జియాలజీ నుంచి ముందస్తు అనుమతి లేకుండా మైనింగ్ తవ్వకాలు జరిపే హక్కు ఎవరికీ లేదని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను రవాణా చేస్తున్నారని ఆమె తెలిపారు. ఎవరైనా అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తూరు తాడేపల్లి అక్రమ మైనింగ్ వ్యవహారంపై మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్‌కు లేఖ రాశామని తెలిపారు. రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి పోలీసుల సహకారంతో అక్రమ తవ్వకాలు, గ్రావెల్ రవాణా జరగకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. తహశీల్దార్ జాహ్నవి వెంట విజయవాడ రూరల్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రామ్ సింగ్, వి ఆర్ ఓ శ్రీనివాసరావు ఉన్నారు.



పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని సచివాలయం-1, పులిగడ్డ సచివాలయం పరిధిలోని పల్లెపాలెం ప్రాంతాలలో అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సామాజిక పెన్షన్లు అందజేశారు. ప్రతినెల 1వ తారీఖున రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న పెన్షన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా బుధవారం ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ లు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్లు మండల వెంకటేశ్వరరావు, కోడూరు సత్యనారాయణ, అవనిగడ్డ పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఒకటో తేదీనే వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వద్ధాప్య, వికలాంగుల పెన్షన్‌లు అందజేస్తూ వారికి అండగా నిలుస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నార.ు బుధవారం పమిడిముక్కల మండలంలోని గోపవాని పాలెంలో పెన్షన్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రం అభివద్ధి పథంలో నడుస్తోందని, ప్రపంచ దేశాల నుండి పరిశ్రమలు వస్తున్నాయని త్వరలో విశాఖపట్నంలో జరిగే పారిశ్రామిక సదస్సే దీనికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి గణేష్, కంబపు రాంబాబు, గోపోనిపాలెం గ్రామ కార్యదర్శి సునీత, కలపాల రాంబాబు, మన్నె కిషోర్ తదితరుల పాల్గొన్నారు.



ఏటిపట్టు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ మండలం ఏటిపట్టు గ్రామాలలో మంచినీటి ఎద్దడితో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. దాదా పు 50 వేల మంది జనాభా తాగునీటి సమస్యలపై ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. రాఘవాపురం స్కీము నుండి మాగల్లు, కొండూరు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, కొణతమాత్మ కూరు, తొర్ర గుడిపాడు, దామలూరు, సోమవరం, రుద్రవరం, గోళ్ళముడి, పల్లగిరి, గ్రామాలకు వెళ్లే ప్రధాన మంచినీటి పైపులైన్ సిలువ గిరి టర్నింగ్ వద్ద లీకై అక్కడ మురుగునీరు తయారై మంచినీటిలో కలిసి మంచినీరు అంతా కలుషితమవుతోంది. కలుషిత మంచినీరు తాగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత ఆర్ డబ్ల్యూ యస్ అధికారులు, వాటర్ స్కీం మేనేజ్మెంట్ కాంట్రాక్టర్ లీక్ అవుతున్న పైపులైన్ మరమ్మతులు చేయించట్లేదు. ప్రభుత్వం నుంచి స్కీం మేనేజ్మెంట్ కి లక్షల రూపాయల నిధులు వెచ్చిస్తా ఉంటే ఆ నిధులను ఏం చేస్తున్నారని నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి) బుధవారం అధికారులను ప్రశ్నించారు.

సామరస్యంగా సేవలందించాలి :ఎస్‌పి

ప్రజాశక్తి-గుడివాడ : ప్రజలతో మమేకమవుతూ సామరస్య పూర్వకంగా పోలీస్ సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ జాషువా సూచించారు. బుధవారం స్థానిక గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డిఎస్పి సత్యానందంతో కలసి అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గుడివాడలో డిఎస్పి సత్యానందం పర్యవేక్షణలో పోలీస్ సేవలు సంతప్తికరంగా ఉన్నాయన్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎక్కువగా భర్య, భర్తల కేసులు ఎక్కువగా వస్తున్నాయని, వారికి ప్రత్యేకంగా కౌన్సింగ్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా పోలీసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలీసులకు అవసరమైన విలువైన సమా చారాన్ని అందించడంలో మహిళా పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐలు జయకుమార్, గోవిందరాజులు, తులసీదర్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రూరల్ పోలీసు స్టేషన్ పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి జాషువా

మురుగునీరు తాగుతూ ఎన్నాళ్లు బతకమంటారు ?

- రామకృష్ణాపురం గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి-కోడూరు : ఇంటింటికి కుళాయి పథకం కోడూరు మండలం రామకష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రవేశపెట్టి మంచినీరు ప్రతి ఇంటికి వదులుతున్నారు కానీ వాటిని శుద్ధిమాత్రం చేయడంలేదు. రామకృష్ణాపురం, ఇరాలి, ఉటగుండం, బసవానిపాలెం గ్రామాలలో గత రెండు వారాలుగా ఇంటింటికి కుళాయిల ద్వారా వస్తున్న మంచినీరు శుద్ధి చేయకుండా పంపిస్తున్నారని అని గ్రామాలలో కుళాయిలు వదిలే వారికి, అధికారులకు తమ సమస్యలు తెలిసిన పట్టించుకోవడంలేదని దిగువ ప్రాంత గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మంచినీరు విడుదల చేసే సిబ్బందిని అడుగుతుంటే ఎప్పటికప్పుడు రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు కానీ ఫలితం శూన్యం. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేసవి కాలాన్ని దష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రామకష్ణాపురం గ్రామపంచాయతీ ప్రజలు కోరుకుంటున్నారు.

మురికిగా వస్తున్న మంచినీరు →



సిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న మహేశ్వర వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-నందిగామ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హమీ ప్రకారం సిపిఎస్ పెన్సన్ విధానం రద్దు చేయాలని యుటిఎఫ్ ఎన్టిఆర్ జిల్లా కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నందిగామ యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ నందిగామ మండలం సమావేశం జరిగింది. యుటిఎఫ్ ఎన్టిఆర్ జిల్లా కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఎన్టిఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులకు పిఆర్సి పెంచాలని, డిఎ బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కుంచం లక్ష్మీ నారాయణ,పిఎస్ హరనాథరెడ్డి, గంగరాజు, వెంకటాద్రి, నరసింహారావు, యలమందయ్య పలువురు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేరీరాణి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామపంచాయతీ సర్పంచ్ నందిగం మేరీ రాణి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మేరీ రాణి తన పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేశారు. పంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి, ప్రముఖులు నందిగం అభిషేకరావు లతోపాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు శుభాకాంక్షలు తెలియజేశారు.



సర్పంచ్‌కు కేకు తినిపిస్తున్న దృశ్యం



పైప్‌లైన్ పనులపై వివాదం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు-పోటుమీద రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా లింగారెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని జరుగువానిపాలెం మంచినీటి చెరువు వద్ద నుంచి జరుగు వానిపాలెం గ్రామానికి వెళ్ళు మంచినీటి పైపులైను మార్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులు తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు మంచినీటి చెరువు వద్దకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం తమ గ్రామానికి వచ్చు పైప్ లైన్ నాలుగు అంగుళాలు ఉందని కానీ, కొత్తగా వెయ్యటానికి తీసుకువచ్చిన పైపులు మూడు అంగుళాలు ఎలా తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లా డుతూ గతంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు జరుగువానిపాలెం గ్రామానికి వచ్చు మంచినీరు సరిపోవటం లేదని పైప్ లైన్ సైజు 5 లేక 6 అంగుళాలు పెంచి వేయాలని కోరామన్నారు. కానీ ప్రస్తుతం అధికారులు అవి ఏమి పట్టించుకోకుండా ఉన్న నాలుగు అంగుళాలు పైప్ లైన్ తొలగించి మూడు అంగుళాల పైప్ లైన్ వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న నాలుగు అంగుళాల సైజుగల పైపులు వేయని క్రమంలో పాత పైప్‌లైన్‌నే కొనసాగించాలని కోరుచున్నారు.

ఉదయ భాస్కరమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఘంటసాల : గొర్రెపాటి ఉదయ భాస్కరమ్మ ఆరవ వర్ధంతి సందర్భంగా ఘంటసాలలో బౌద్ధ గురువు బంతేజి ఆధ్వర్యంలో బౌద్ధ సాంప్రదాయంతో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి విద్య ట్రస్ట్ ప్రతినిధులు గొర్రెపాటి చంద్రశేఖర రావు, కొండపల్లి రామకష్ణ, సిపిఎం నాయకులు వాకా రామచంద్ర రావు, భలే రమేష్, భలే జనార్దన్ రావు, పిడిగే ఆదినారాయణ, నాగరాజు, ముసిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-గుడివాడ : పురపాలక సంఘ పరిధిలోని 2022 - 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి పన్నుల వసూళ్లపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకష్ణ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ పట్టణంలోని పన్ను బకాయిలను ఈ నెల 25తేది లోపు 100 శాతం వసూళ్లు చేయాలని సిబ్బందికి అదేశాలు జారిచేశారు. ఈ సమవేశంలో మున్సిపల్ అసిసెంట్ కమిషనర్ రంగారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యదర్శి ఎన్నిక

ప్రజాశక్తి-గుడివాడ : టైలర్స్ వర్కర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా జన్ను శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక టైలరింగ్ స్ట్రీట్‌లో అసోసియేషన్ నూతన కార్యదర్శి శ్రీనువాసరావును పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ వర్కర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లంకపల్లి లాజర్, ట్రజరర్ ఎం.మంగరాజు, గౌరవ అధ్యక్షులు రసూల్ బేగ్, నాయకులు సిహెచ్ సత్యనారయణ, వి.నరసింహారావు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన

- మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గోసంఘం,రుద్రవరం వద్ద నిర్మిస్తున్న 2,304 టిడ్కో గహ సముదాయంలో మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఆమె రుద్రవరంలో నిర్మించిన 1440 ఏపీ టిడ్కో గహాల మౌలిక సదుపాయాల కల్పనకు 10 కోట్ల 15 లక్షల రూపాయలు కేటాయించగా, అందులో మొదటి విడతగా 3 కోట్ల 38



లక్షల వ్యయంతో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిడ్కో ఇంజనీర్లు, పలువురు లబ్దిదారులతో కలిసి టిడ్కో గహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మచిలీపట్నం గో సంఘం వద్ద 864 ఫ్లాట్లు, రుద్రవరం వద్ద 1440 ఫ్లాట్లు కలిపి మొత్తం 2,304 ప్లాట్లకు సిమెంట్ రోడ్ల నిర్మాణంలో అత్యంత ఆధునిక సాంకేతిక పద్ధతులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవితా థామస్ నోబుల్, టిడ్కో ఎస్ఈ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. చిన్నోడు, మునిసిపల్ కమిషనర్ జీ. చంద్రయ్య పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి జగన్

మంత్రి ఆర్‌కె రోజా - మహిళా కబడ్డీ విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వం అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. పట్టణంలోని ఎస్‌జిఎస్ కళాశాల ప్రాంగణంలో ఎస్వీఎం ప్రసాద్ మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి కృష్ణాజిల్లా, విశాఖపట్నం, మూడో బహుమతి విజయనగరం జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కబడ్డీ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌ను రోజా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోజా మాట్లాడుతూ మహిళలంటే వంటింటికే పరిమితం కాదని, అవకాశం ఇచ్చి వెన్ను తడితే విజయం సాధిస్తారన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఈ పోటీలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహణ ఇలానే ప్రతి సంవత్సరం నిర్వహించాలని, క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రభుత్వం తరపున సైతం ప్రోత్సాహం ఇస్తామన్నారు. అనంతరం మంత్రి ఆర్కే రోజా, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక రాములను పూలమాల శాలువాలతో ఉదయభాను దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వేల్పుల రవికుమార్, తుమ్మల ప్రభాకర్, వి.మనోహర్ పాల్గొన్నారు.

పాపులర్ షూమార్టు విరాళం

ప్రజాశక్తి-భవానీపురం: కొత్తపేట రాజా సాహెబ్ ప్రసూతి వైద్యశాలకు పాపులర్ షూ మార్టు గ్రూపు సంస్థల ట్రస్టు 25 కుర్చీలను విరాళంగా అందించినట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ చుక్కపల్లి అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



కొత్తపేటలోని ప్రసూతి ఆసుపత్రికి వైద్య సేవలకు వచ్చే వారు కుర్చీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనితో తమ సంస్థ విషయాన్ని తెలుసుకుని కుర్చీలను అందించినట్లు తెలిపారు. 25 ఫైబర్ కుర్చీలను బుధవారం హాస్పటల్ మెడికల్ ఆఫీసరు డాక్టర్ వాణిశ్రీకి పాపులర్ షూ మార్టు హెడ్డాఫీసు బాధ్యులు కె.శ్రీనివాస్, సిహెచ్.రవీంద్రకుమార్ అందజేశారు.

ఐడిబిఐ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వినియోగదారుల సేవే లక్ష్యంగా ఐడీబీఐ బ్యాంకు పనిచేస్తూ అభివృద్ధి పథంలో నడుస్తుందని ఐడీబీఐ బ్యాంకు ఛీఫ్ జనరల్ మేనేజర్ ఏ.జోసెఫ్ కుమార్ అన్నారు. కానూరు సెంటర్‌లో బుధవారం నూతనంగా ఐడీబీఐ బ్యాంకు నూతన శాఖను బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు.



అనంతరం మాట్లాడుతూ అతి కొద్ది కాలంలోనే బ్యాంకు ప్రజాభిమానం చూరగొని దినదినాభివృద్ధి చెందిందన్నారు. బ్యాంకు వినియోగదారుల కోసం కొత్త కొత్త పథకాలను ప్రారంభిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఋణాలకు సంబంధించి వడ్డీ రేటు కూడా తక్కువగా అందిస్తున్నామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారుల కోసం ఎప్పటికపుడు నూతన పథకాలను తీసుకువస్తున్నాట్లు తెలియచేశారు. ఈకార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ వి.వాసుదేవన్, డిజిఎంలు జాయ్ రాజన్, శైలజ, బ్యాంక్ మేనేజర్ సంజీవ్ కుమార్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్‌బిఆర్‌సిఇ కళాశాలకు అవార్డు

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు సిస్కో నెట్‌వర్కింగ్ బెస్ట్ అకాడమీ అవార్డు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 27వ తేదీన బెంగుళూరులో 25వ సిస్కో అకాడమీ వార్షికోత్సవ వేడుకలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా తమ కళాశాలకు అవార్డు ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఈ అవార్డు రావటానికి కృషి చేసిన ఉపాధ్యాయులు కె.ఫణీంద్ర, ఎన్ శ్రీకాంత్‌లను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, వివిధ విబాగాధిపతులు అభినందించారు.

విద్యార్థులు సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు సైన్సు విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఆల్‌రౌండర్లుగా ఎదగాలని నారాయణ స్కూల్స్ ఆర్‌ఐ బి.కిరణ్‌కుమార్ అన్నారు. కానూరులోని నారాయణ ఈకెఎన్‌డి పాఠశాలలో సైన్సు ప్రదర్శన బుధవారం ఏర్పాటుచేశారు. ప్రదర్శనను ప్రారంభించిన కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్సు పట్ల ఆసక్తి కలిగించడంతో పాటు, సామాజిక అంశాలపై కూడా అవగాహన కల్పించే విధంగా నారాయణ పాఠశాల కృషి చేస్తుందన్నారు.



ఇందులో భాగంగానే విద్యార్థుల ఆలోచనలకు చక్కని రూపం ఇచ్చే విధంగా వారు తయారుచేసిన సైన్సు అంశాలను ప్రదర్శనగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సైన్సు ఎగ్జిబిషన్‌తో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను తమ పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూపించాలనే ఉద్దేశంతో సైన్సు మోడల్స్ ప్రదర్శన ఏర్పాటుచేరసినట్లు తెలిపారు. విద్యార్థుల నుండి మంచి స్పందన లభించిందన్నారు. అనంతరం సైన్సు ప్రదర్శన విజేతలకు బహుమతులను అందచేశారు. ఈకార్యక్రమంలో అకడమిక్ డీన్ రాజాశోభనాద్రి , వైస్ ప్రిన్సిపల్స్ సుమిత్ర, రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుండి దుర్గగుడిలో మహా రుద్రయాగం



హోమగుండం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కర్నాటి రాంబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో ఈ నెల 2వ తేదీ నుండి 6వ తేదీ వరకూ లోకకళ్యాణార్థం శత చండీ సహిత మహా రుద్రయాగం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ళ భ్రమరాంబ, ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. బుధవారం బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండో తేదీ గురువారం ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజతో ప్రారంభమై 3వ తేదీ నుండి ప్రతిరోజూ ఉదయం 8 నుండి 12 గంటల వరకూ, సాయంత్రం 3 నుండి 5.30 గంటల వరకూ హోమ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. 6న ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతితో రుద్రయాగం పూర్తవుతుందని వివరించారు. 7వ తేదీన పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు యాగశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కొండపైన పొంగలి షెడ్‌లోని ఏర్పాట్లను పరిశీలించి ట్రయల్ రన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు బచ్చు మాధవీ కృష్ణ, బుద్దా రాంబాబు, కార్యనిర్వాహక ఇంజినీర్ కె.వి.ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మొబైల్ యాక్ససరీస్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

స్వదేశీ బ్రాండ్ జెన్ జడ్ పేరుతో నోప్ సంస్థ యువత కోసం ప్రత్యేంగా గాడ్జెట్స్ మొబైల్ యాక్సరీస్‌ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి రామ్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రధానంగా ఇయర్ ఫోన్లు, ఎకో, నియో, బడ్డీ, షాట్ల పేరుతో ఉన్న డబ్ల్యుఎస్ ఇయర్ బడ్‌లు, బూమ్, బజ్ పేరుతో ఉన్న బ్లూటూత్ స్పీకర్లు, విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న యువత ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకుని వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. స్మార్ట్ వాచీలు, యూఎస్‌బి ఛార్జర్లతో పాటు ఫిట్ బ్యాండ్లు, యూఎస్‌బి టైప్ సి ఛార్జింగ్ కేబుల్స్, కార్ ఛార్జర్లు, పవర్ బ్యాంక్‌లు కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు.

ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఎకెటిపి మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో నిర్వహించిన సైన్సు ఫెయిర్‌లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు సంగిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో నిర్వహించిన సైన్సు ఫెయిర్‌కు మంచి స్పందన లభించిందన్నారు. 1800 మంది విద్యార్థులు వారి తరగతులకు సంబంధించిన వివిధ పాఠశాలలోని నమూనాలను తయారుచేసి ప్రదర్శనగా ఏర్పాటు చేశారన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు హ్యాపీలైఫ్ ఫౌండేషన్ సంస్థ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, హ్యాపీలైఫ్ ఫౌండేషన్ అధ్యక్షులు టి.గిరిబాబు, ఫౌండేషన్ సెక్రటరీ మామిడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం.ప్రభాకర్, బి.గణేష్ పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక భవానీపురం 42వ డివిజన్‌లోని శ్రీ వెంకట సాయిశ్రీ వద్దాశ్రమంలో నివసిస్తున్న వద్దులకు బుధవారం శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం డివిజన్లలోని 127, 130 సచివాలయాలను సందర్శించి సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌బి కాలనీలోగల అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ పిల్లలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె చికిత్సకు రూ.8 లక్షల సాయం

స్థానిక 44వ డివిజన్ విద్యాధరపురం ప్రాంతానికి చెందిన ఒలేటి రంగా గత కొద్ది రోజులుగా గుండెకు సంబందించిన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సిఎం సహాయ నిధి ద్వారా రూ.8.06 మంజూరు చేయించారు. బుధవారం బాధితుడు రంగా ఇంటికి వెళ్లి చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి బుజ్జి, కొనకళ్ల విద్యాధరరావు, మైలవరపు దుర్గారావు, గొంట్ల మోహనరావు, నాళం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రియల్‌మీ జిటి2 ఛార్జింగ్ పవర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అత్యంత విశ్వసనీయమైన టెక్నాలజీ బ్రాండ్ రియల్‌మీ జీటీ3 ఛార్జింగ్ పవర్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ బిజినెస్ సీఈవో మాధవ్ సేత్ ఒక ప్రకటనలో తెలిపారు. రియల్‌మి జీటీ3తో స్మార్ట్‌ఫోన్‌ల కోసం వేగవంతమైన, సమర్థవంతమైన సురక్షితమైన ఛార్జింగ్ కోసం బార్‌ను పెంచుతుందన్నారు. దీని శక్తివంతమైన ఫీచర్లు అద్భుతమైన డిజైన్‌తో, రియల్‌మీ జీటీ3 స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలో కొత్త బెంచ్‌మార్కును సెట్ చేస్తుందని తెలిపారు. అంతకంటే ముఖ్యంగా వినియోగదారులకు అసాధారణమైన అనుభవిఆన్ని అందిస్తుందన్నారు. యువత కోసం అత్యాధునిక సాంకేతికతలు, పురోగతి ఆవిష్కరణల ద్వారా మార్కెట్ స్థానాన్ని మెరుగుపరచుకోవడంలో రియల్‌మి అంకితభావాన్ని చూపిస్తుందన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.ఆంజనేయులు

ప్రజాశక్తి:మైలవరం: రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం, కార్మికుల హక్కుల కోసం ఉపాధి హామీ పథకం క్రింద 200 రోజులు పని దినాలు కల్పించాలని, భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుల కార్డులు ఇవ్వాలని నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీన జరిగే ఛలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఛలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పోరేట్లకు దోచి పెడుతూ దేశ ప్రజలపై పన్నుల భారం మోపి మధ్య తరగతి, సామాన్య ప్రజలు జీవించలేని స్థితికి నెట్టిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. రైతు హక్కులను చట్టాలను నిర్వీర్యం



చేస్తూ, రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందన్నారు. కార్మికుల హక్కుల రక్షణకోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే చలో డిల్లీ కార్యక్రమంలో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, సిఐటియు మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం స్పందన సమావేశపు మందిరంలో ఆయన, పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కూమార్‌తో కలసి పామర్రు నియోజకవర్గంలోని జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు మండలంలో లేఅవుట్ల పనుల్లో వెనుకబడి ఉన్నారని, జూలై నుంచి ఇప్పటి వరకు 8 నెలలుగా లేఅవుట్లలో ఏ విధమైన పురోగతిని చూపించలేదంటూ ఎంపీడీఓ, తహసీల్దార్, పంచాయతీ హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్ల మెరక కోసం మట్టి తరలింపుపై అంతిమ నిర్ణయం ఎంపీడీఓ, తహసీల్దార్లదేనని చెప్పారు. లేఅవుట్లలో లెవలింగ్, అప్రోచ్, అంతర్గత రోడ్లు వంటి పనులకు మంజూరు కాని వాటికి సవరణ ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలతో సంబంధం లేకుండా లేఅవుట్లలో విద్యుత్, నీటి సరఫరాను ఏర్పాటు చేయాలని చెప్పారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లలో ప్రగతి సాధించడానికి వివిధ శాఖల అధికారులు సమన్వయపరచుకుంటూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి అధికారులు కషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మించడానికి వచ్చే మూడు నెలలు కీలకమైన సమయమని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ జివి. సూర్యనారాయణ, ఎస్ఈ పీఆర్ రమణారావు, ఉయ్యూరు ఆర్డీఓ విజయకుమార్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంఎల్ఏ కైలే

14న వాహనాల వేలం

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసులో కాలం చెల్లిన వాహనాలకు 14వ తేది వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జాషువా తెలిపారు. కాలం చెల్లిన 11 వాహనాలను 3 లాటులుగా విభజిస్తూ, ఆన్లైన్ పద్ధతిలో వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు వాహనాలను ప్రత్యక్షంగా పరిశీలించుకుని WWW. Konugolu. ap.gov.in లో ఈ ఆక్షన్ బిడ్డింగ్ వేలం పాట పాడుకోవాలని చెప్పారు.

జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ప్రజాశక్తి-పెడన : పట్టణ పరిధిలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి సాల్మన్ రాజ్‌ని ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ వి శేషగిరి బాబు బుధవారం సస్పెండ్ చేశారు. కళాశాలలో పనిచేస్తున్న తోటి ఉద్యోగిని పై గత ఏడాది ఆగష్టు నెల లో ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా పోలీస్‌లకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు జిల్లా అధికారి బొడ్డు వరప్రసాద్ తెలిపారు. ఇంచార్జ్ ప్రిన్సిపల్ గా తెలుగు లెక్చరర్ టి శీను బాబును తాత్కాలంగా నియమించారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : జిల్లాలో మొదటి పేజ్ లో భాగంగా అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్లో డొమెస్టిక్ డేటా ఎంట్రీలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ధ్రువపత్రం, ఉద్యోగ నియామక పత్రాలను అవనిగడ్డ మండల పరిషత్ సూపరిడెంట్ షేక్ అతావుల్లా చేతులు మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యువతకు జీవనోపాధి ఉద్యోగ అవకాశం కల్పించేదానికి ఆంధ్రప్రదేశ్ నైపుణ్య శిక్షణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐసస్ ఎక్స్ పీరియన్సెస్ ఏవన్ మార్ట్ లో 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. వారికి నియామక పత్రాలను కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత ఉపయోగించుకొని మంచి ఉద్యోగాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి మాటా



నియామకపత్రాలు అందిస్తున్న దృశ్యం

ుడుతూ స్కిల్ హబ్ ద్వారా రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ యువతకు శిక్షణ ఇవ్వడం ఉపాధి అవకాశం కల్పించడం నియామక పత్రాలు అందజేయటం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ శాంత్ కుమారి, ఎస్పిఓసి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ఎం రామారావు, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది పథ్వి, ప్రశాంత్ కుమార్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం నుండి కైలే సుబ్బారావు బహిష్కరణ


ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : నందివాడ మండలం, శంకరంపాడు గ్రామ సర్పంచ్, సిపియం పార్టీ డివిజన నాయకుడు కైలే సుబ్బారావును పార్టీ ప్రాధమిక సభ్యత్వం నుండి పార్టీ జిల్లా కమిటీ బహిష్కరించినట్లు సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై నరసింహారావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత కొంత కాలంగా పార్టీ రాజకీయ విధానానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని, జిల్లా నాయకత్వం దీనిపై హెచ్చరించినా ఆయన తన తప్పును సరిదిద్దు కోవడానికి నిరాకరించడం వలన పార్టీ నుండి బహిష్కరించామని పేర్కొన్నారు.



ఉయ్యూరులో ఆందోళన చేస్తున్న దృశ్యం

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండలంలో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ముందు పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బి. కీర్తి మాట్లాడుతూ సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం మరొకసారి షాక్ ఇచ్చిందని, గహ వినియోగ గ్యాస్ తో పాటు కమర్షియల్ గ్యాస్ ధరలను చమురు కంపెనీలు భారీగా పెంచాయన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలకు సామాన్యులు విలవిలలాడుతుండగా తాజాగా పెరిగిన ధరలతో మరింత భారం పడుతుందని అన్నారు.వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకురాలు నిమ్మాది ప్రశాంతి, హైమా, సంతోష్ కుమారి ,నాగలక్ష్మి, రమాదేవి, కుసుమ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని గన్నవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పెద్ది వాసుదేవరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర సిపిఐ పిలుపు మేరకు గన్నవరం సిపిఐ కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. ఈ కార్యాక్రమంలో ముక్కమాల ఉమామహేశ్వరవు, పెద్ది వెంకటరత్నం, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు,తాడి శివరామకష్ణ,సామల విజయ్,అలవాల ఏసురాజు, రేమల్లి రాజేష్ పాల్గొన్నారు.



మంచుకాదు..పొగే

ప్రజాశక్తి-గన్నవరం : ఈ ఫోటోలో కనిపిస్తున్నది పొగ మంచు అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. ఇది పంచాయతీ అధికారులు పెట్టిన పొగ. ఇది గన్నవరం ఆగిరిపల్లి రహదారి దుస్థితి. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం ఆగిరిపల్లి రహదారి వెంబడి డంపింగ్ యార్డ్ లేకపోవడంతో వాహనదారులు పడే ఇబ్బందులు అంతా అంతా కాదు కళ్ళ నిండా పొగ రహదారి కనిపించదు వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కానీ ఇవన్నీ అధికారులకు కనిపించవు వినిపించవు. కేంద్రీకతమైన గన్నవరం గన్నవరంలో డంపింగ్ యార్డ్ కు నోచుకోకుండా రహదారి వెంబడి పొగతో కూడిన మంచు వాహన శోధకులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అటు పందులు అడ్డం పడతాయా కంటిలో పొగ తోడుచుకోవాలా తెలియదని జనాలు అంటున్నారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

- గుడివాడ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక 35 వార్డు సచివాలయాన్ని అకస్మికంగా మున్సిపల్ కమిషనర్ మురళీకష్ణ తనీఖీ చేశారు. బుధవారం స్థానిక 35వ వార్డులోని సచివాలయ ంలోని రికార్డులపై అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సచివాలయంలో రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా సచివాలయ ఉద్యోగులు పాటించాలని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.



కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కాలనీలు, బస్తీల్లో ాకుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. చిన్నపిల్లలకే కాదు పెద్దలకు కూడా వీటి బెడద తప్పడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్లలో వెటర్నరీ విభాగాలున్నా, అవి నామమాత్రంగా కొనసాగుతున్నాయి. వీధి కుక్కలు పెరిగిపోవడానికి, నగరాల్లో ఏటా వేలసంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదవడానికి ఆయా కార్పొరేషన్లలో అధికార యంత్రాంగాల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మచిలీపట్నం కార్పొరేషన్లో వీధికుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు తక్కువేనన్న విమర్శలూ ఉన్నాయి. కార్పొరేషన్‌లో ఈ ఏడాది కుక్కల సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను కూడా నిలిపివేసినట్లు సమాచారం. అయితే స్టెరిలైజేషన్ (సంతాన నియంత్రణ) చేస్తున్నట్లు అధికారులు మాత్రం



చెబుతున్నారు.

ప్రతిసారీ 4 నుండి 8 పిల్లల వరకు


కుక్కల జీవిత కాలం 8 నుంచి 12 సంవత్సరాలు. 8 నెలల వయసు నిండేటప్పటికి సంతానోత్పత్తి సామర్థ్యం వస్తుంది. కుక్కల గర్భధారణ సమయం 60 నుంచి 62 రోజులు. ఒక్కో కుక్క సంవత్సరానికి రెండు పర్యాయాలు సంతానోత్పత్తి చేస్తుంది. సంతానోత్పత్తి జరిపిన ప్రతిసారీ 4 నుంచి 8 పిల్లలు పెడుతుంది.

ఒక కుక్క, దాని పిల్లలు, పిల్లల పిల్లలు!

ఒక కుక్క దాని పిల్లలు కలిపి ఏడాది కాలంలో దాదాపు 42 కుక్క పిల్లలను పెడతాయి. వాటి పిల్లలు, పిల్లల పిల్లలు ఇలా మొత్తం ఏడేళ్ల కాలంలో దాదాపు 4 వేల కుక్కలు పుడతాయని అంచనా. ఇలా కుక్కల సంతతి అభివద్ధి చెందుతున్నా వాటిని తగ్గించే కార్యక్రమాలు అంత చురుగ్గా సాగడం లేదు. దీంతో వీధికుక్కల సంఖ్య తగ్గడం లేదు.

స్టెరిలైజేషన్‌తోనే నియంత్రణ:

వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గమని వెటర్నిటి డాక్టర్లు చెబుతున్నారు. అంటే కుక్కల పునరుత్పత్తి ప్రక్రియను నియంత్రించేలా శస్త్రచికిత్సలు చేయడం. మొత్తం కుక్కల్లో ఆడకుక్కలన్నింటికీ ఒకేసారి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు జరిగితేనే కుక్కల సంతతి తగ్గుతుంది. ఏటా వేలాది కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు ఆయా కార్పొరేషన్ల వెటర్నరీ విభాగాల అధికారులు చెపుతున్న మాటలన్నీ డొల్ల మాటలేనని కుక్కల సంఖ్య పెరిగిపోతున్న తీరు స్పష్టం చేస్తోంది.



ఆడకుక్కలన్నిటికీ ఆపరేషన్లు చేయాలి :

జైపూర్, గోవాల్లో ఈ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. ఆడ కుక్కలన్నింటికీ ఆపరేషన్లు చేయడంతో పాటు మగవాటికి సంతానోత్పత్తి వయసు వచ్చే సమయంలోనే (8 నుంచి 12 నెలల మధ్య) సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తారు. వీటితో పాటు 'మిషన్ ర్యాబిస్' పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తారని, కుక్కల బారిన పడకుండా ఎలా వ్యవహరించాలి, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలుస్తోంది. ఇకపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన జగన్ : ఎంఎల్‌ఎ ఏలూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : అగ్రిగోల్డ్ బాధితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మోసం చేశారని టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. బాధితులను ఆదుకుంటామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి జగన్ అధికారంలోకి వచ్చారని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లవుతున్నా బాధితుల సమస్యలను పట్టించుకోకపోవడం లేదన్నారు. వారి గోడు వినేందుకు కూడా అపాయింట్‌మెంటు ఇవ్వకపోవడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు.

సేకరణ లక్ష్యాన్ని పెంచని ప్రభుత్వం

❁ఆర్‌బికెల్లో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు ❁మద్దతు ధర రాక నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఖరీఫ్ సీజన్లో ఈ క్రాప్ చేసిన వరి పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. కృష్ణాజిల్లాలో లక్షన్నర ఎకరాలు వరి నూర్పిళ్ల జరగాల్సి ఉంది. అయితే లక్ష్యంగా పూర్తయిందనే కారణంతో ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని పెంచకపోవడంతో రైతులు అయినకాడకు మిల్లర్లకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తోంది.



2021-22 ఖరీఫ్ సీజన్లో కృష్ణాజిల్లాలో 4,08,900 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. 96 శాతం విస్తీర్ణంలోని పంటకు ఈ క్రాప్ నమోదైంది. దీనికిగాను 10 లక్షల టన్నులు దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆర్‌బికెల ద్వారా 5.06 లక్షల టన్నులు కొనుగోలు చేసింది. మరో లక్షన్నర ఎకరాల్లోని ధాన్యాన్ని సేకరించాల్సి ఉంది. ఈనేపథ్యంలోనే ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మరో 1,68,500 టన్నులు పెంచాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వాన్ని కోరింది. అయితే 18 రోజులైనా ఇప్పటి వరకు లక్ష్యాన్ని పెంచలేదు. దీంతో రైతులు అయినకాడకు మిల్లర్లకు అమ్మి నష్టపోవాల్సి వస్తోంది.

మొవ్వ మండలం వేములమడ గ్రామానికి చెందిన వడ్డీ వెంకటేశ్వరరావు ఎంటియు 1318 వరి వంగడాన్ని ఆరు ఎకరాల్లో సాగు చేశారు. 15 రోజుల క్రితం కుప్ప నూర్పిడి చేశారు. ఆర్‌బికెకు సమాచారం ఇచ్చారు. అయితే ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందనే కారణంతో కొనుగోలు చేయలేదు. దీంతో ఆ రైతు మిల్లర్లు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఎ గ్రేడ్‌కు చెందిన 75 కిలోలు బస్తాకు రూ.1545కు మద్దతు ధర రావాల్సి ఉంది. కానీ మిల్లర్లు బస్తా రూ.1250 చొప్పున 210 బస్తాలు కొనుగోలు చేశారు. దీంతో ఒక్కో బస్తాకు రూ.295 చొప్పన మొత్తం 210 బస్తాలకు రూ.61,950 వరకు ఆ రైతు నష్టపోయాడు. ఘంటసాల మండలం కొత్తపల్లికి గ్రామానికి చెందిన మేడంకి వెంకటేశ్వరరావు ఈనెల 7న ఆర్‌బికె ద్వారా 236 బస్తాల ధాన్యాన్ని మిల్లుకు తోలాడు. కానీ ఇప్పటి వరకు ఆ ధాన్యం ఆన్‌లైన్ కాలేదు. ఈనెల 8 నుండి ఈ గ్రామానికి సంబంధించి ఘంటసాలపాలెం ఆర్‌బికెలో ధాన్యం సేకరణ నిలిపివేశారు. ఘంటసాలపాలెంలో ఇంకా 320 ఎకరాల్లో కుప్పలు నూర్చాల్సి ఉంది. ధాన్యం సేకరణ ఆగిపోవడంతో రైతులు కుప్ప నూర్పిళ్లను నిలిపివేశారు. రైతులు నేరుగా అమ్ముకున్న ధానాన్ని మిల్లర్లు బి రిజిస్టర్లో నమోదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

గ్యాస్ మంటలు

సిలిండర్లను గృహదారులు వినియోగిస్తున్నారు. కృష్ణాజిల్లాలో 45 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 6,06,497 సిలిండర్లు, ఎన్‌టిఆర్ జిల్లాలో 56 ఏజెన్సీల ద్వారా 7,31,230 సిలిండర్లు వినియోగిస్తున్నారు. తద్వారా ఉమ్మడి జిల్లావాసులపై నెలకు 6 కోట్ల 68 లక్షల 86 వేల 350 రూపాయల భారం పడుతోంది. ఇది ఏదాదికి 80 కోట్ల 26 లక్షల 36 వేల 200 రూపాయలుగా ఉంది. విడివిడిగా చూస్తే కృష్ణాజిల్లావాసులపై నెలకు 3 కోట్ల 3 లక్షల 24 వేల 850 రూపాయలుగా, ఏడాదికి 36 కోట్ల 38 లక్షల 98 వేలుగా 200గా ఉంది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లావాసులపై నెలకు 3 కోట్ల 65 లక్షల 61 వేల 500 రూపాయలు, ఏడాదికి 43 కోట్ల 87 లక్షల 38 వేల రూపాయల భారం పడుతుంది.

అలాగే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.350 పెంపుతో మచిలీపట్నంలో కమర్షియల్ సిలిండర్ ధరరూ.1930.50 నుంచి రూ.2279.50లకు పెరిగింది. అలాగే విజయవాడలో రూ.1929.50 నుంచి రూ.2260.50లకు చేరింది. విజయవాడ నగరంలో 27 గ్యాస్ ఏజెన్సీల ద్వారా నెలకు 36 వేల కమర్షియల్ సిలిండర్లు వినియోగమవుతున్నాయి. విజయవాడ మినహా మిగిలిన ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని 78 ఏజెన్సీల ద్వారా మరో 32 వేల సిలిండర్లను వినియోగిస్తున్నారు. మొత్తంగా 68 వేల కమర్షియల్ సిలిండర్ల వినియగదారులపై నెలకు 2 కోట్ల 38 లక్షల భారం పడనుంది. విడివిడిగా చూస్తే విజయవాడలోని 36 వేల కమర్షియల్ వినియోగదారులపై నెలకు రూ.1.26 కోట్లు, ఏదాదికి రూ.15.12 కోట్ల భారం పడుతుంది. అలాగే విజయవాడ మినహా మిగిలిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 32 వేల కమర్షియల్ సిలిండర్ల వినియోగదారులపై నెలకు రూ.1.12 కోట్లు, ఏడాదికి రూ.13.44 కోట్ల భారం పడుతుంది. కమర్షియల్ సిలెండర్లను ఎక్కువగా హోటళ్లు, స్వీట్ షాపులు, హోం ఫుడ్స్, బేకరీ వంటకాల్లో వినియోగిస్తున్నారు. ఈ సిలిండర్ల ధరను భారీగా పెంచడంతో టిఫిన్, భోజన హోటళ్లు, హోం ఫుడ్ సెంటర్లు, ఫాస్టు ఫుడ్ సెంటర్లు, స్వీట్ షాపులు, చిన్నపాటి పునుగుల నుంచి బిర్యానీ వరకు అన్నింటి ధరలూ పెరిగే అవకాశం ఉంది. కేంద్రం ఒక్కసారిగా ధర రూ.350 పెంచడంతో దీని ప్రభావం వీటిపై పడనుంది. ఇప్పటికే కొన్ని హోటళ్లలో ఒక దోసె, ప్లేట్ ఇడ్లీపై గతంలో ఉన్న ధరలకన్నా రూ.5 వరకు పెంచారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

ప్రజలను దొంగ దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. ఓవైపు ప్రజల ఆదాయాలు నానాటికీ పడిపోతుండగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ అంతులేకుండా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. గ్యాస్ ధరలపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి నేతలు, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి నేతలు స్పందించాలని కోరారు. ప్రజలపై భారాల మోపే బిజెపితో జతకట్టడానికి ప్రయత్నిస్తున్న పార్టీలకు కూడా ప్రజల బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి, పశ్చిమ, సెంట్రల్ సిటీ కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, తూర్పు సిటీ నాయకులు పుప్పాల కృష్ణ, నాయకులు కె.దుర్గారావు, టి.ప్రవీణ్, చింతల శ్రీను, కృష్ణమూర్తి, ఝాన్సీ, షకీల తదితరులు పాల్గొన్నారు.

పాల ధర పెంపు అన్యాయం

యూనియన్ పాల ఉత్పత్తులపై రూ.12 కోట్లు జిఎస్‌టి భారం పడిందన్నారు. అంతేగాక దాణా ధరలు కూడా పెరిగాయన్నారు. పేదలు, పిల్లలు ఉపయోగించే పాలు, పాల ఉత్పత్తులపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాడి రైతులకు లీటరుకు రూ.4 రాయితీ ఇస్తానని చెప్పి అమలు చేయకపోవటం బాధాకరమన్నారు. బోనస్ ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం...సహకార సంఘాల రైతులకు అందించకుండా మోసంచేసిందని విమర్శించారు. గుజరాత్ కార్పొరేట్ సంస్థ అమూల్ కంపెనీపై రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు కురిపిస్తోందని విమర్శించారు. పెంచిన పాల ధరలను తగ్గించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, పశ్చిమ, సెంట్రల్ సిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, బి.రమణరావు, సిపిఎం నాయకులు ఎం.సీతారాములు, జి. వెంకట్రావు, జి.రంగారెడ్డి, కె.దుర్గారావు, పి.సాంబిరెడ్డి, ఎం.కొండారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BHARATH KUMAR JAIN (Old Name)**, Resident of Door No. 21-10-38/A, Attarataiah Street, Governorpet, Vijayawada, NTR District, A.P. My Name has been changed to **BHARAT KUMAR JAIN (New Name)** Hereafter my name is known as **BHARAT KUMAR JAIN.**

మహారాజశ్రీ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, నూజివీడు
S.O.P. No.1 / 2023

Between
మునగాల సీతామహాలక్ష్మి ... పిటీషనర్
అండ్
నిల్ ... రెస్పాండెంట్

పై నెంబరు దావా నందు సక్సెషన్ సర్టిఫికెట్ కొరకు పిటీషనరు అయిన శ్రీమతి మునగాల సీతామహాలక్ష్మి, భర్త : శ్రీ మునగాల వెంకటేశ్వరరావు, డోర్ నెం. 8-77/20, అంబేద్కర్ సెంటర్, విస్సన్నపేట గ్రామం, విస్సన్నపేట మండలం, ఎన్‌టిఆర్ జిల్లా - 521 215. ఆంధ్రప్రదేశ్ గ్రామ కాపురస్తులు పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనర్ గారి యొక్క కుమారుడైన మునగాల సూర్యభార్గవ ఫణి సంతోష్ ది. 28-6-2022న ఇంటెస్టేట్‌గా పరమపదించినారు. కావున సదరు మునగాల సూర్య భార్గవ ఫణి సంతోష్‌గారు అవివాహితుడు అయినందున అతనికి సంబంధించి క్లాస్ వన్ హెయిర్‌గా అతని తల్లి అయిన శ్రీమతి మునగాల సీతామహాలక్ష్మి గారు మాత్రమే అయివున్నారు. కాబట్టి పై కోర్టు నందు సక్సెషన్ సర్టిఫికెట్ పొందు నిమిత్తం గాను ఎవ్వరికైనను యేద్విదమైన అభ్యంతరములు గాని, హక్కులు గాని వున్న యెడల ది. 11-04-2023 వాయిదా తేదీ లోగా స్వయంగా గానీ లేక లాయరుగారి ద్వారా గాని, వారి ఆక్షేపణలు తెలియపరచవలెనని కోరటమైనది. లేనియెడల పిటిషనర్ గారి పరోక్షమున దావా తీర్మానించబడునని ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతిన)

శ్రీ మదిరి శ్యామలరావు,
శ్రీమతి నూకతోటి ప్రమీల
అడ్వకేట్స్, గాంధీనగర్,
విజయవాడ- 520 003.

నూజివీడు
తేది:01-03-2023

మహారాజశ్రీ కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, మచిలీపట్నం వారి కోర్టులో
జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 63/2022

(మైనరు మేకా సీతారామ్, హిందువు, 16 సం॥లు వయస్సు, మైనరు తండ్రి : మేకా విజయకుమార్, హిందువు, నివాసం : డోర్ నెం. 1-19-69/2, రోడ్ నెం.2, త్యాగరాయ నగర్, రిలయన్స్ కమ్యూనికేషన్ దగ్గర, కాప్రా, ఈ.సి.ఐ.ఎల్., సికింద్రాబాద్ వారి కేసులో)

బిట్వీన్ :
మేకా సంధ్యారాణి ... పిటీషనర్
అండ్
నిల్ ... రెస్పాండెంట్స్

పై నెంబరు జి.డబ్ల్యు.ఓ.పి.లో మేకా సీతారామ్‌కు పిటీషనరు తల్లి అయివున్నది. మరియు నాచురల్ గార్డియన్ అయివున్నది. మేకా సీతారామ్ పేరున భాగపంపిణీ ద్వారా వచ్చిన ఆస్తిలో ఆదాయము లేనందున య. 1-46 సెంట్లలో 1/4 వంతు అనగా య.0.36 సెంట్లు మాత్రమును మేకా సీతారామ్‌కి మంచి విద్య, మరియు వైద్యము అభివృద్ధి నిమిత్తము అమ్ముటకుగాను పరిశీలన నిమిత్తం పై నెంబరు జి.డబ్ల్యు.ఓ.పి.ని దాఖలు చేయగా సదరు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపైన ఎవరికైనా ఎట్టి అభ్యంతరాలు వున్న యెడల ది. 16-3-2023వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేదా వకీలుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల తదుపరి గ్రంథములు జరిపించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు :- కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, చల్లపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, వక్కలగడ్డ గ్రామపంచాయతీ ఏరియాలో చేరిన రీ.సర్వే నెం.లు 143-1 మరియు 143-2లో య.1-46 సెంట్లకు హద్దులు :
తూర్పు: మేకా రామచంద్రరావు గారి స్థలం.
దక్షిణం: చిల్లల వాగు
పడమర : యార్లగడ్డ సునీతగారి స్థలం
ఉత్తరం : కంతమనేని సౌమ్యగారి స్థలం
ఈ హద్దుల మధ్య మేకా సీతారామ్ అమ్మదలచిన ఆస్థి య.0.36 సెంట్లు.
వాయిదా : 16-3-2023

ఇట్లు
ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ,
పిటీషనరు తరపు అడ్వకేటు,
అవనిగడ్డ - 521 121.
సెల్ : 9908160589

కోర్టు ప్రకటన

In the court of the VIII th Addl District judge at Vijayawada
M.V.O.P No: 88/2021
Between:- Mohammed Karimunnisa & 2 others ....Petitioners
And
Y.Sudhakar& 5 others ...Respondents
To,
R4, Mohammad Asifa Begum,
R5, Mohammad Parvez,
R6, Mohammad Jamilunnisa
above named respondents are Residing at D.No:-8-16-30/1 Madhivari Street, Whinchipet, Vijayawada-1
............4th,5th&6th Respondents

పై నెంబరు పిటీషను లో పిటీషనర్స్ కు చెందినవారు రోడ్డు ప్రమాదంలో చనిపోవుటచే వారి వారసులు నష్టపరిహారం కోరుతూ పై పిటీషన్ దాఖలు చేయగా సదరు 4వ, 5వ మరియు 6వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట ది.07-03-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదా అయి ఉన్నది. కావున మీరు ప్రత్యక్షంగా గాని, లాయరు గారి ద్వారా హాజరై మీ ఆక్షేపణల తెలుపు కోనవలెను. లేని యడల పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 07-03-2023
ఇట్లు:- బషీర్ ఖాన్
న్యాయవాది, విజయవాడ-10

ప్రకటన

నా క్లయింటు ప్రతాప సీతారామశాస్త్రి గారి కుమారుడు కోదండరామమూర్తి, ఏలూరు మండలం, ఏలూరు నగరం మోతేవారితోట వాస్తవ్యులు వారి తరఫున సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా విజయవాడ, కృష్ణలంక, శంకరమఠం నందు వీరికి సంక్రమించిన ఖాళీ నివేశన స్థలం చూచుటకు వచ్చి స్థలం తాలూకు లింకు డాక్యుమెంటు 1623/1956 సం॥ విజయవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు రిజిస్ట్రీ అయివున్న ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ నిమిత్తం కృష్ణలంక నల్లగేటు సమీపం నందు ది.20-02-2023 తేదీన ఉదయం 10-30 గం.లకు జిరాక్స్ సెంటర్ వద్ద పోయినది. కావున ఈ దస్తావేజు ఎవరికైనను దొరికిన యెడల ఈ దిగువ అడ్రసుకు తెచ్చి ఇవ్వగలరు. ఈ దస్తావేజు పై ఎవరైనను ఎటువంటి లావాదేవీలు జరిపియున్ననూ మా క్లయింటుపై బైండు చేయజాలవని యిందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
పి.రమేష్, అడ్వకేట్,
డోర్ నెం.41-24/2-3,
గంగానమ్మ గుడివీధి, కృష్ణలంక,
విజయవాడ-520013.
సెల్: 9840571885.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 211/2009

Between:
Sri Y.Mohan Babu (died) Per LR□s ***...Plaintiffs***
AND
1. Smt. Dandamudi Sakuntala
2. Smt. Mallineni Vimala Kumari ***...Defendants***

2వ ప్రతివాది:
శ్రీమతి మల్లినేని విమలకుమారి, భర్త: రామకృష్ణ, స్త్రీ, వయస్సు 63 సంవత్సరాలు, డోర్ నెం. 72-22-1, కోనేరువారి వీధి, మిల్క్ బజార్, పటమట, విజయవాడ (అర్బన్)

పై నెంబరు దావాలో వాదులు మిమ్ములను 2వ ప్రతివాదిగా చేర్చిన దరిమిలా, వాది కోరిన పరిహారం నిమిత్తం, మీ హాజరు నిమిత్తం స్వతహాగా కానీ సంపూర్ణముగా సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు వుత్తరములు చెప్పకూడిన ప్లీడర్ ద్వారా కానీ, అటులనే అన్నీ అన్ని ప్రశ్నలకు వుత్తరములు చెప్పకూడిన యేదో ఒక మనిషి ద్వారా గాని సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **2023న మార్చి నెల 17వ తేదీన 10.30 గంటలకు** ఈ కోర్టులో హాజరగుటకున్ను ఆరోజున మీరు ఈ దావాలో సంజాయిషీ చెప్పు రిటెన్ స్టేట్‌మెంట్ దాఖలు చేయుటకున్ను మరియు మీ ఆధీనములో వున్నటువంటి మీ ప్రతివాదనకు లేక కౌంటర్ క్లెయిమ్ గాని అవసరమైన సమస్త దస్తావేజులు దాఖలు చేయుటకున్ను మరియు మీ ఆధీనములో వున్న సమస్త దస్తావేజులు దాఖలు చేయు నిమిత్తం పై నెంబర్ దావాలో మీకు సమన్లు అమలు కాని కారణంగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రత్యామ్నాయ అమలు నిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా అమలు చేసే విధంగా ఆర్డర్ పొంది యున్నారు. పైన చెప్పబడ్డ దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్షమందు వాజ్యమును విమర్శ చేసి తీర్మానించడమగునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 17-03-2023

దశిక మురళీకృష్ణ
డి.ఎస్.వి.మాణిక్యాలరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ఏలూరు సెల్: 7386335599

గ్రామ స్వరాజ్యానికి నిదర్శనం సచివాలయాలు : ఎంఎల్ఎ


ప్రజాశక్తి-అవనిగడ్డ : గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యానికి నిలువెత్తు నిదర్శనం గ్రామ సచివాలయాలని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. బుధవారం అవనిగడ్డలో నూతనంగా నిర్మించిన 2,3,5 సచివాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎప్పుడైతే ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకెళుతుందో అప్పుడే ప్రజల సంతోషంగా ఉంటారని అలాంటి ప్రజా పాలనను ప్రజల చెంతకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి కోటి రూపాయల సామాజిక ఆస్తిని సమకూర్చిన ఘనత ముఖ్యమంత్రి దేని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు తెలుగుదేశం ప్రభుత్వంలో ఆ పార్టీ కార్యకర్తల అభివద్ధికి ఉపయోగించేవారని కానీ నేడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ నిధులతో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రం వంటి నిర్మాణాలతో సామాజిక ఆస్తిని సమకూరుస్తుందన్నారు. ముఖ్యమంత్రి కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆరు గంటల లైన్లో ఉంటే గాని పెన్షన్ వస్తుందో రాదు తెలియని పరిస్థితి ఉండేదని కానీ నేడు ఉదయం 6 గంటలకే లబ్ధిదారులు ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ ఇచ్చే విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకులా ఉంటూ వారి బాగోగులు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడపకొల్లు నరసింహారావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచేశ్వరరావు, ది డ్ల వెంకటేశ్వరరావు(కిరణ్)



నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రివికాస్, దక్షిణచిరువోలులంక, రామచంద్రపురం, తుంగల వారిపాలెం సర్పంచులు సనకా సుబ్రహ్మణ్యం, వాకా రమేష్, తుంగల దేవరాజు, ఎంపీటీసీ సభ్యులు నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

త్వరలో గృహ నిర్మాణాలు ప్రారంభం : ఎఇ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక పంచాయితీ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ప్రోత్సాహంతో జగనన్న కాలనీలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు అతి త్వరలో చేపట్టబోతున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవ కష్ణ తెలిపారు. గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న కాలనీలోని లబ్ధిదారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో తాండవ కష్ణ పాల్గొన్నారు. కోసూరువారిపాలెం, మేళ్లమర్రు, మేళ్ళమర్తి లంక, ఉత్తర చిరుగోలులంక గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మేళ్లమర్తిలంకలో గల జగనన్న కాలనీలో 132 ప్లాట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు విద్యుత్ శాఖ ఏ.ఇ పాండురంగారావు చెప్పారు. కాలనీకి లెవెలింగ్ చేయటానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ లెవెలింగ్ చేయడానికి ముందుకు రాకపోవడంతో మేళ్లమర్తిలంక లేఔట్ లో లెవెలింగ్ పనులు చేయలేదు. లెవలింగ్ పనులు చేస్తే, గహాలు నిర్మించుకోవడానికి ముందుకు వస్తామని లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కొల్లిపర రామ కోటేశ్వరరావు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జంపాన గౌతమి తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి కోడూరు : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని కోడూరు మండలం టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కోరారు. బుధవారం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని 1,5,6,7,8 వార్డులలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అభివద్ధి నిరోధక, హింసాత్మక విధానాలను ప్రజలకు వివరించారు. ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాల నాశనం చేశారని, రానున్న ఎన్నికలలో చంద్రబాబు నాయుడుని సీఎంని చెయ్యకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని బండే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కాగిత రామారావు, జరుగు వెంకటేశ్వరావు, బడే వీరబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి : డిఇఓ

ప్రజాశక్తి-గన్నవరం : పదిలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు బాలికలు కృషి చేయాలని డిఇఓ తెహరా సుల్తానా చెప్పారు. బుధవారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఆమె ఇంట్రాక్ట్ అయ్యారు. పదిలో ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్మీడియట్లో ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పొందాలంటే ఎక్కడా బ్రేక్ పడకుండా చదువుకోవాల్సిన బాధ్యత బాలికల మీద ఉందన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా ఈ నెల రోజులు చదువుకోవాలని సూచించారు. అత్యధిక



మాట్లాడుతున్న డీఈవో సుల్తానా

మార్కులు సాధించిన విద్యార్థులకు రివార్డులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పలువురికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం వెలివోలుకు చెందిన పారిశ్రామికవేత్త వేములమడ కుమారస్వామి హైదరాబాదులో ఉంటున్నారు. మంగళవారం ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనుటకు వచ్చిన ఆయన ఇటీవల ఇల్లు కాలిపోయిన బొల్లా శ్రీనవసరవుకు రు పదివేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే. కాలు తొలగించిన మండపాకల కష్ణారావు కు పది వేలు, ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమైన డూప్లర్ కొనుగోలుకు ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిత వేములమాడ అనిల్ కుంపటి కష్ణారావు , వేములమడ శివయ్య పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వైఎస్ ఆర్సిపి కార్యాలయంలో బాపులపాడుకు చెందిన నర్సింగ్ చదువుతున్న దయాల దీపికకు రూ.10వేలు ఎమ్మెల్యే వంశీ ఆదేశాల మేరకు రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ నక్క గాంధీ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థి కంగా వెనుకబడిన వారికి సాయం నిరం తరం కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినీకి సాయం చేస్తున్న దృశ్యం

నూతన సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : సమసమాజ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని పామర్రు శాసనసభ్యులు కైలా అనిల్ కుమార్ అన్నారు. చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డలో 50 లక్షలతో నిర్మాణ దాత డాక్టర్ వేములపల్లి సురేష్ నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని బుధవారం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనిల్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్ ఆర్ జీఎస్ నిధులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభివద్ధికి ఉపయోగించేవారని, నేడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆ నిధులతో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం వంటి నిర్మాణాలతో రూ. కోటి విలువ



చేసే సామాజిక ఆస్తి సమకూరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోకొడాలి మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, డాక్టర్ వేములపల్లి సురేష్, పురిటిగడ్డ,వక్కలగడ్డ, పాగోలు గ్రామ సర్పంచులు మాతంగి రమ్య, వల్లూరి ఉమా, శ్రీనివాసరావు డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి కళాపీఠాన్ని సందర్శించిన సచ్చిదానంద

ప్రజాశక్తి - మొవ్వ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠాన్ని తూర్పు గోదావరి జిల్లా, తుని ,తపోవనం పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య సచ్చిదానంద స్వామి సందర్శించారు. కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ గంగా బాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో జరిగిన దేవతామూర్తుల నూతన విగ్రహ పునఃప్రతిష్ఠా మహెూత్సవంలో పాల్గొన్న స్వామిజీ కళాపీఠాన్ని సందర్శించి సిబ్బందికి, విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి తమ సిబ్బందితో కలిసి స్వామిజీకి సాదర స్వాగతం పలికారు. కళాపీఠం వైశిష్ట్యాన్ని, కూచిపూడి నాట్యాచార్యుల చారిత్రక విశేషాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి స్వామిజీకి వివరించారు.వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకష్ణ ,కళాపీఠం విద్యార్థి సత్య శ్రీనివాస వాగ్దేవి ప్రసాద్ ల నాట్యప్రదర్శనలను స్వామీజీ తిలకించారు. బాలాత్రిపురసుందరి గ్రంథాలయ పాలకులు వై.వి ఫణికుమార్ ,కళాపీఠం సిబ్బంది అనుసరించారు.

సంగ్రమ యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశకి-గన్నవరం : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానన్నీ నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డా.మున్నంగి నాగరాజు అన్నారు. రాజమండ్రి నుండి విజయవాడ వరకు చేపట్టిన మాదిగల సంగ్రమ పాదయాత్ర వచ్చే నెల 3 వ తేదీన గన్నవరం నియోజకవర్గలోనికి లోకి ప్రవేశిస్తుందని మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ మంద వేణుబాబు అన్నారు. అయన బుధవారం వీరపనేని గూడెంలో ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర వచ్చే నెల 3న బాపులపాడు మండలంలోని బొమ్ములూరులోకి ప్రవేశిస్తుందని అన్నారు. కావున నియోజకవర్గం లోని మాదిగ మరియు మాదిగ ఉపకులల వారు ఈ పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడంకి శ్రీనివాసరావు, మంతెన రమేష్, తిరివీది నాని, వడ్లమూడి బాబురావు, జంపన యాలమండల , వడ్లమూడి ప్రసాద్ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులను వినియోగించాలని ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో భూమిని కాపాడుకోవాలని కోరుతూ విద్యార్థులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. సర్పంచ్ రోహిణి ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతూ.. సేంద్రీయ విధానం ద్వారా భూమిని కాపాడుకోవాలన్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం వలన భూమి గొల్ల భారీ దెబ్బతింటుందని దాన్ని తగ్గించడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.



వైసిపి నాయకుల దౌర్జన్యంపై నిరసన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లపై వైసీపీ నాయకులు, పోలీసులు చేసిన దౌర్జన్యాన్ని నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ నివాసం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీసు వారు కౌన్సిల్ హాలులోకి ప్రవేశించి కౌన్సిలర్స్‌ని అరెస్ట్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో మహిళలకు జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు, ఆచంట సునీత, నూకల కుమార్ రాజా, మేక వెంకటేశ్వర్లు, రాధాకష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, షేక్ ఖాసిం, గింజుపల్లి రమేష్, గట్టీడి దుర్గాప్రసాద్, షేక్ సత్తార్, కళ్యాణం బ్రదర్స్, కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం జరిగిన సంఘటనలపై శ్రీరాం రాజగోపాల్ సూచనలతో టిడిపి కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, కంచెటి గీతారాణిలు బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావుని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, మున్సిపల్, ఆర్టీసీ పోలీస్ వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేయటం జరిగినది.

అక్రమ అరెస్టు దారుణం : సిపిఎం

మున్సిపాలిటీ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ సభ్యులు, పోలీసులు వ్యవహరించిన తీరు సరైనది కాదని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోట కృష్ణ, కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి, షేక్ గౌస్ మియా, దంతాల నరేంద్ర, కోట రవికుమార్, కె శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరావు ఖండించారు. ప్రజల చేత ఎన్నిక కాబడిన కౌన్సిలర్లు సమస్యపై చైర్మన్‌ను అడిగినప్పుడు స్పందించి సమాధానం చెప్పాల్సింది పోయి అక్రమంగా అప్రజాస్వామ్య పద్ధతిలో అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు.

పాల ధర పెంపుపై సిపిఐ నిరసన



ప్రజాశక్తి-వన్‌టౌన్: గుజరాత్ రాష్ట్రానికి చెందిన పాల పరిశ్రమ అమూల్‌పై ఉన్న శ్రద్ధ ఆంధ్రాలో ఉన్న పాడి పరిశ్రమపై ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఎందుకు లేదని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రశ్నించారు. పెంచిన పాల ధరలను ఉపసంహరించాలని కోరుతూ చిట్టినగర్‌లోని మిల్క్ ప్రాజెక్టు వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాడిరైతులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పారని, అది ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. రాబోయే రోజుల్లో సామాన్యులు పాలు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. పెంచిన పాల ధరలు తగ్గించని పక్షంలో పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.భాస్కరరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, డి.వి.రమణబాబు, తూనం వీరయ్య, ఓర్సు భారతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ (ఐఎఎల్) యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి డిపో సెంటర్‌లో వున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఐఎఎల్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమంలో అజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకర్ రాజు, సహాయ కార్యదర్శి వెంకటరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు షరీఫ్, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు జగన్నాథరావు, అన్నేపాగ సుందరరావు, ప్రస్తుత అధ్యక్షులు యర్రమాస్ ధనంజయ, న్యాయవాదులు ఆరేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రిక్షా పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ 43వ వర్ధంతి సందర్భంగా రిక్షా పోటీలను బస్టాండ్ వద్ద జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌బాబు బుధవారం ప్రారంభించారు. బస్టాండ్ నుండి షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డు వరకు రిక్షా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ, కొత్త పురుషోత్తం, కాసర్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పటల్‌లో వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బాలింతలకు బెడ్స్, పండ్లు, పాలు పంపిణీ చేశారు.

జుజ్జూరును మండల కేంద్రం చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి-వీరులపాడు: జుజ్జూరు మండల నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో జుజ్జూరు గ్రామాన్ని మండల కేంద్రం చెయ్యాలని శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుండి మేరీ మాత విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జుజ్జూరు గ్రామాన్ని మండలాన్ని ఐదు వేల పోస్టుకార్డులతో మద్దతు తెలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జుజ్జూరు గ్రామ సర్పంచ్ రమావత్ కోటి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, దుర్గంపూడి వేణుగోపాల్ రెడ్డి, జిల్లేపల్లి స్వామి, వేముల వెంకటనారాయణ, పూల రాంబాబు, మేడికొండూరు రవి పాల్గొన్నారు.

అసైన్డు భూములపై వివాదం సృష్టిస్తున్నారు : సిపిఎం



ప్రజాశక్తి-మైలవరం: మైలవరంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీలకు చెందిన అసైన్డ్ భూములను కొందరు అధికారులు మరో గ్రామానికి మార్చి గందరగోళం సృష్టిస్తూ వివాదాలకు కారణం అవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు అన్నారు. మైలవరం రెవిన్యూ పరిధిలోని సర్వే నెం.311 నుండి 321 వరకూ 54 మంది లబ్దిదారులకు 1974లో 72 ఎకరాల భూమిని అసైన్డ్ చేసి పేదలకు అందజేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది భూస్వాములు, పెత్తందార్లు దళితులను బెదిరించడంపై జెసికి వినతిపత్రం అందజేసిన క్రమంలో బుధవారం విఆర్‌ఒలు, మండల సర్వేయర్ అసైన్డ్ భూమిని పరిశీలించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ 1954 నుండి పేదలు ఈ భూముల్లో ఉంటున్నారన్నారు. ఇప్పుడు అధికారులు బౌండరీలు మారాయని, నెంబర్లు మారాయని పేదలను తప్పుదోవ పట్టిస్తూ భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. పేదలందరూ ఐక్యంగా వుంటే తమ భూములను కాపాడుకోవచ్చన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా కదలాలి : సిఐటియు

ప్రజాశక్తి-మైలవరం: నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల సాధనకై ఐక్యంగా కదలి రావాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పిలుపునిచ్చారు.జి కొండూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహాసభ పజ్జురు శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తుందని,పథకాలు నిలిపివేసిందని దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర చట్టానికి లోబడి పనిచేసే సంక్షేమ బోర్డును పనిచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కూడా ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. సంక్షేమ బోర్డు రక్షణ కోసం పథకాల అమలు కోసం కార్మికులందరూ ఐక్యంగా ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. వెంకటేశ్వరరావు, మండలంలోని వివిధ గ్రామాల నుండి మేస్త్రిలు, కార్మికులు పాల్గొన్నారు.అనంతరం యూనియన్ మండల అధ్యక్షులుగా కోసూరు కొండలరావు, ఉపాధ్యక్షులుగా మిక్కిలి రాజు,పి చిరంజీవులు,సగ్గుర్తి ప్రవీణ్,ప్రధాన కార్యదర్శిగా లంకోజు శ్రీనివాసరావు,సహాయ కార్యదర్శులుగా సి హెచ్.గోపాలకష్ణ, పటాపంచల వెంకటరావు కె. సిహెచ్ రామారావు, కోశాధికారిగా పజ్జూరు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా పజ్జురు శ్రీనివాసరావు,రంగు బ్రహ్మాహం,ఎం.పరమేశ్వర్ రెడ్డి,కమిటీ సభ్యులుగా చిరంజీవి జమలయ్య రామాచారి ఆరేపల్లి శివ, భక్తుల శంకర్ మోచారపు గోపీలను ఎన్నుకున్నారు.

రహదారులకు ప్రారంభోత్సవం



ప్రజాశక్తి-సింగ్‌నగర్: 63వ డివిజన్ రాజీవ్ నగర్లోని డాక్టర్స్ కాలనీలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 11 అంతర్గత రహదారులను స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నాడునేడు ఫోటో ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయిస్తూ మునుపెన్నడూ లేని విధంగా ఆయా ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నట్లు వెల్లడించారు. అలాగే భవిష్యత్ అవసరాలను దష్టిలో ఉంచుకుని నియోజకవర్గ వ్యాప్తంగా అభివద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ గురునాథం, 64వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, నాయకులు పసుపులేటి యేసు, సీహెచ్ రవి, మోదుగుల గణేష్, టెక్కం కృష్ణ, తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఉద్ధంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

64వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన

సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం విశేషంగా కషి చేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. బుధవారం 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజాశక్తి నగర్లో విస్తతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో పీఓయూసిడి కె.శకుంతల, సీడీఓ జగదీశ్వరి, వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్.కె.ఇస్మాయిల్, అధ్యక్షులు జిల్లెల్ల శివ, నాయకులు యరగొర్ల శ్రీరాములు, అక్కిశెట్టి నారాయణ, పందిరి వాసు, మేడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి కర్రసాము విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విజయవాడ

ఆలిండియా సిలబమ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో తమిళనాడులో జరిగిన 19వ జాతీయ స్థాయి సిలబమ్ (కర్రసాము) పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన రామలింగేశ్వర్‌నగర్ 15వ డివిజన్‌కు చెందిన ఆకుల హితేష్, పుట్టంరాజు శ్రీ కారుణ్యలకు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఘన స్వాగతం పలికి వారికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో సిల్వర్, కాంస్య పతకాలను సాధించిన హితేష్, శ్రీకారుణ్యలు విజయవాడ నగరానికి గర్వకారణమని దేవినేని అవినాష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లక్ష్మణరావుకు సత్కారం

ప్రజాశక్తి-సింగ్‌నగర్

ప్రపంచ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన వాంబే కాలనీ ప్రాంతానికి చెందిన లక్ష్మణరావును ఏ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త, సీనియర్ జర్నలిస్ట్ పఠాన్ బాబ్జి ఉమర్ ఖాన్, ప్రతినిధులు అలంపూరు విజయ్‌కుమార్, బాషా, గౌస్, షేక్ జిలాని, షేక్ అన్వర్, రాజేష్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడరూరల్

నున్న గ్రామంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల నిత్యకళ్యాణ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఈఓ పజ్జురు మోహనరావు, శివాచార్యులు మామిళ్లపల్లి ఫణికుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బ్రోచర్‌లను ఆవిష్కరించారు. 5న ఉదయం గోపూజతో ప్రారంభమై 6న కల్యాణ మహోత్సవం, 7న రథోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.